# విశారద

"ప్రియమైన అమ్మకు నమస్సులు.

నేనిక్కడ లెక్చరర్ ఉద్యోగంలో చేరి సంవత్సరమైంది కదా ! ఆనాటి నుండి అద్దెఇంటి కోసం ఈ టౌనంతా గాలిస్తున్నాను. ఎవ్వరింట్లో గది అడిగినా, మీ కులమేమిటి ? అని అడుగుతున్నారు. నోర్మూసుకుని తలదించుకుంటున్నాను. కాని... ఈ రోజే మనకు సరిపోయే పోర్షన్ అంటే.... ప్రత్యేకంగా కట్టిన ఇల్లు దొరికింది. వెంటనే అడ్వాన్సు ఇచ్చేశాను. రేపే అందులోకి మారుతున్నాను. నువ్వు ఎల్లుండి తప్పక రావాలి. నేనే అక్కడికి రావాలంటే కుదరడం లేదు. మాది ప్రైవేట్ కాలేజి గదా ! పరీక్షలు దగ్గరికొస్తున్నాయి. కాబట్టి ఆదివారం కూడా ప్రైవేట్ క్లాసులుంటున్నాయి. మనూళ్లో బస్సెక్కి నువ్వు సిద్ధిపేటలో దిగగానే సంతోషిమాత దేవాలయందాకా ఆటోలో వచ్చేయి. దేవాలయం ఎదురు గల్లీలో ఎడమప్రక్క మొదటి ఇల్లు మనది. ఇహ నువ్వు రాత్రింబవళ్లు రెక్కలు ముక్కలు చేసుకోవాల్సిన అవసరం లేదు..."

నిన్ననే చేతికందిన కొడుకు ఉత్తరాన్ని మరోసారి చదువుకుని కొండంత పొంగిపోయింది శారద. బస్సు కిటికీలోంచి బయటి ప్రపంచంవైపు దృష్టి మరల్చింది. రోడ్డుపక్క చెట్లను వెనక్కు నెట్టేస్తూ బస్సు ముందుకు పరుగెత్తుతోంది. హాయిగా ఉంది. కళ్లు మిలమిల లాడినై.

"ఎందుకమ్మా కళ్లల్లో నీళ్లు?" సీటు పక్క నడివయస్కురాలు ముక్కుమీద వేలేసుకుంది.

కళ్లు తడుముకుంది. అవును.... కళ్లల్లో నీళ్లు.

"ఇవి కన్నీళ్లు.... కదా!" కొనకొంగుతో అద్దుకుంది. కొడుకు మనోహర్ రూపం కళ్లల్లో కదలాడింది. ఆలోచన ఆవులించింది...

వానికుద్యోగమైతే దొరికింది కాని పెళ్లి కావాలి. కొడుకూ కోడలూ చిలకాగోరింకల్లా కళ్లముందు తిరుగుతూంటే.... ఓహ్ ! ఎంత బావుంటుందో. ప్చ్... ఆశలు ఆకాశాన్నంటుకుంటే నుదుటిరాత పాతాళానికి తోసెయ్యదుకదా ! తన సంగతి తెలిసినవాళ్లు వానికి పిల్లనిస్తారా ? తెలియక పిల్లనిచ్చినా ముందు ముందు తిప్పలు తప్పవు. చిన్నప్పుడు బడిలో పిల్లలు గేళి చేశారని మనోహర్ ఓసారి అడిగాడు.

"అమ్మా ! మనదేం కులమే ?"

"కులంతో నీకేం పని ?"

"మా నాన్న ఎవరే ?"

"అలాంటి ప్రశ్నలడిగి నన్ను బాధ పెట్టొద్దు..." ఖచ్చితంగా చెప్పేస్తుంటే కళ్లల్లో నీళ్లూరినై.

"అమ్మా !" బెంబేలెత్తి పోయాడు...."నీ కన్నీళ్లు నేను చూడలేనమ్మా. స్కూల్లో సన్నాఫ్

నీ పేరే ఉంది గదా ! అదే ఉండని. స్నేహితులేమన్నా... తలదించుకుంటాలే. ఈసారి అలా అడగనమ్మా" తల్లడిల్లిపోయాడు.

కాని... ఇప్పుడు తప్పుతుందా ! పిల్లనిచ్చేవాళ్లు కులగోత్రాలడగరా !... తెగని ఆలోచనలు.

ఎందుకైనా మంచిదని సీటుకొరికి కళ్లు మూసుకుంది. మనసు తెరమీద గతం చిత్రాలు కదలాడుతున్నాయి.

✿ ✿ ✿

"అమ్మా ! నాకు పెళ్లెప్పుడు చేస్తావే ?" స్నేహితురాలి పెళ్లి చూసొచ్చి తల్లినడిగింది శారద.

కూతురుది అమాయకత్వమో, అతితెలివో అర్థం కాలేదు పార్వతికి.

"నీకెప్పుడో పెళ్లైంది గదా !"

"ఎవలతోని ?"

"దేవునితోని"

"నా మెడల తాళిబొట్టెవరు గట్టింద్రూ ?"

"........................"

"నా మొగుడేడి ?"

"గుడిలున్న దేవుడే"

"ఆ జోగినాథుని విగ్రహమా ?"

"అవును. ఆ విగ్రహం తరపున మన ఆలనాపాలనా చూసేవాడే నీ మొగుడు."

"అంటే... ఆ శ్రీరంగమా ?"

"అవును"

"అతని కంటే ముందు మరొకాయన చూస్తుండే గదా !"

"అప్పుడతడే ఇప్పుడితడే"

"శ్రీరంగం మనసు మారితే"

"అప్పుడెవలు ముందుకొస్తరో చూద్దాం..."

"అయితే... మనది బజారుకుక్క బతుకన్నమాట. ఎవరు బుక్కెడన్నం బెడ్తే వాళ్లకు ఒళ్లప్పగించాలె...." ఎన్నడూలేని ఆవేశం పొడుచుకొస్తుంది. "సరే ... ఎవ్వలూ రాకపోతే...." నవ్వాలో ఏడ్వాలో అర్థంగాలేదు.

"ఆ దేవుడే దిక్కు"

"అంటే !..." భవిష్యత్తు చీకటిగా, భయంకరంగా కన్పించింది.

"నువ్వేం భయపడకే. ఈ ఊళ్లో ధనవంతులున్నారు. దర్జా కోసమన్నా నిన్నుంచుకుంటారు.

ఇప్పుడు కడుపుతో ఉన్నావు గదా ! ఇంకో ఆర్నెల్లకు నీకో ఆడపిల్ల పుడుతుంది. ఆ పిల్ల పెరిగి పెద్దమనిషయేదాకా ఎవరో ఒకరు నీదగ్గరికి తప్పక వస్తారు"

"అటెన్క...."

"అటెన్క ఆ పిల్లకు దేవుడ్తోని పెండ్లిజేస్తం. దానికోసం మస్తు మంది ఎగపడ్తరు. అందులోంచి ఎవరో ఒకరు... మన మంచీ చెడు చూస్తుంటారు...."

"గిట్లెందుకమ్మా ! మనం మనుషుల్ని పెండ్లాడొద్దా ? అందరు ఆడపిల్లల్లోలె మనం గూడా ఒక్కణ్నే పెండ్లి జేసుకుని అతంతోనే జీవితాంతం ఉండలేమా ? లోకమంటే ఏందో నాకు తెల్వకముందే ఏదేదో తూతూమంత్రం జేసి నాకు పెండ్లయిందంటున్నావు. దేవుడు మొగుడంటున్నావు. నువ్వేమో ముప్పయ్యేదేండ్లకే ముసల్దానివైపోయినవు. రేపు నా పనిగూడా అంతే. అటెన్క నా కూతురు గతీ అంతే. ఇదేం పద్ధతమ్మా !" తల్లిని నిలదీస్తూ కుతకుతలాడింది.

ఎప్పుడూ ఇట్లా మాట్లాడని కూతురు ఇప్పుడెందుకిట్ల అడుగుతుందో.... కడుపులో కలిబెట్టినట్టైంది పార్వతికి.

"మనం జోగినులం. జోగినులు గిట్లే ఉండాలని ఆ దేవతల నిర్ణయం. మా అమ్మమ్మ, అమ్మ నాటి నుండి ఇదే జోగినాథుని గుడిల ఉంటున్నాం. గిట్లే బతుకుతున్నాం. కానీ... నీకు డాన్సు నేర్పించినగదా. నీ కూతురుగ్గూడా నేర్పుదాం లేవే !"

ఆవేశం, అసహ్యంతో శారద గుండెలెగసి పడుతున్నై. ముక్కుపుటాలు కదిలిపోతున్నై.

"మనం జోగినులమని మన నుదుటిమీద రాసి పంపించిండా ఆ దేవుడు ? మనం గిట్లే బతకాలని నిర్ణయించింది ఈ గుడిలున్న జోగినాథుడా లేక కొవ్వెక్కిన ఆ భూస్వాములా ?"

అవాక్కైంది పార్వతి. కూతురును ఎగాదిగా చూస్తోంది.

"చెట్టు పేరు జెప్పి కాయలమ్ముకునే నడుమంత్రపోళ్లు. దేవుని పేరు జెప్పి దయ్యాలై మనల్ని పీడిస్తుంద్రమ్మా ! ఇదన్యాయం...."

"న్యాయమో, అన్యాయమో, కాలే కడుపుకు మండే గంజి చాలదా ? దేవుడు మన నసీబు గిట్లే రాసిండు".

"రాసింది ఆ దేవతలు కాదమ్మా... ఈ గ్రామదేవతలు. దొంగభక్తులు..." పళ్లు, పిడికిళ్లు బిగుసుకుపోతున్నై. "మనం బలహీనులం. అందుకే ఈ సమాజం మనల్ని నడిబజార్ల నిలవెట్టింది. మనై గాలి బతుకులైపోయినై. కానీ... కాలం మారింది. మనమూ తిరగబడదామమ్మా!"

"తిరగబడితే తిండికి లేక ఛస్తం" శారద చెంప చెళ్లుమంది. తనను తాను ఆపుకోలేక పోయింది పార్వతి. 'నిన్ను బడికి దోలిచ్చి చదువు చెప్పించినందుకు గిట్ల మాట్లడ్తన్నావుగదా!" పొంగుకొచ్చే దుఃఖాన్ని గొంతులో అదిమిపెట్టింది. "పాపం ! ఆ వీరయ్య సేటు నన్ను తన సొంత పెండ్లామోలె చూస్కున్నడు. నిన్ను బడికి దోలిచ్చినా కాదనలేదు. ప్చ్... ఈ గుడిలున్న పాము కాటుకే చచ్చిపోయిండు గదా !"

"పాపాత్ముడు కాబట్టే దేవుని పాము కాటేసింది"

"నోర్మూయ్. వీరయ్య చాలా మంచోడు, మనకేమీ తక్కువ జెయ్యలేదు. గుడిల బిచ్చం గూడా అడుక్కోనీయలేదు."

"నిన్ను ఎవడన్నా ఎగరేసుకుపోతాడనే భయం"

"అయ్యో ! నువ్వు నోర్మూసుకోకుంటే తోలు వొలుస్తా" ఫ్యాక్టరీ సైరన్‌లా గంయ్‌మంది.

వీరయ్య సేటు తండ్రి నాగరాజుకతడొక్కడే కొడుకు. కొడుకు చావగానే ఆస్తి కోడలు కప్పజెప్పి కూతురు దగ్గరికెళ్ళిపోయిండు.

"ఆస్తంతా కోడలు కిచ్చిండు గాని నీకో చిల్లిగవ్వ గూడా ఇవ్వలేదు గదా !" అందామనుకుని ఆ మాటలనలాగే మింగేసింది.

... ఏదో ఒకటి చెయ్యాలి. ఈ బురదగుంటలోంచి బయటపడాలి... మనసులో ఆరాటం బలపడింది. కాని... మనిషి నిస్సహాయత. కొంతకాలం శ్రీరంగం చేతిలో కీలుబొమ్మ కాక తప్పలేదు.

నెలలు నిండుతున్నాయి. శ్రీరంగం రాక తగ్గిపోయింది. నిండు గర్భిణి శారద బయట తిరుగలేదు. రోజంతా జోలెబట్టి భక్తుల ముందు దేవరించడం పార్వతి వంతైంది.

"పేరు పార్వతి.... చేసేది పాడుపని"

"వన్నెల వగలాడి కూతురుంది గదా ! దాని అందాల మీద బతుకుతుంది".

"మరి... జోగిని అన్నా, పార్వతి అన్నా ఒకటే గదా...."

ఎవరెట్లా దెప్పిపొడిచినా మనసు చంపుకుని మౌనం వహించడం అలవాటైంది. అభిమానం జాగృతమైతే అవమానం తప్పదు. పైసనో, పావలానో జోలెలో వేసేవాళ్లుండరు...

ఆరోజు కార్తీక పౌర్ణమి. శారదకు పుత్రోదయమైంది. బారసాలనాడు "పిల్లవాడు అందగాడు, మనోహర్ పేరు బెడితే బావుంటుంది" అన్నారెవరో, అదే పేరు ఖాయమైంది.

"పున్నమినాడు మగపిల్లవాడు పుడితే అదృష్టవంతుడవుతాడంటరు గదమ్మా" సంతోషంగా అంది శారద.

"అదృష్టమా... నా బొందనా !" పార్వతి మూతులు తిప్పింది.

"ఎందుకమ్మా ?"

"జోగినికి ఆడపిల్ల పుడితేనే అదృష్టం..."

"అంటే... అదిగూడా పెరిగి మనోలె మురికిగుంటల దిగవడాలనా ?" కోపమొచ్చింది.

"అయ్యో... నాకర్థంగాదే శారదా ! ముందు ముందు మన గతేంది ? ఆడపిల్లైతే మన కాధారం గదా ! మురికిగుంట అనుకుంటే ఎట్లా ? మన జన్మ ఆదేవుని సేవకే గదా!"

అరికాలు మంట నెత్తికెక్కింది.

"ఇది దేవుని సేవ కాదమ్మా, దయ్యాలకు బలి. నాకు కొడుకే పుట్టిండు, మంచిదైంది".

"గట్టనుకుంటున్నావా ?" చేతులు తిప్పుతూ ఏదేదో మాట్లాడింది. చివరికి "నేనా శ్రీరంగం ఇంటికిప్పుడే పొయ్యోస్తా, మన గతేందని గల్లాపట్టి అడుగుతా..."

"వద్దమ్మా !" గుండె గుబగుబలాడింది. "వాడొట్టి రౌడీగాడు, నువ్వు వానింటికి పోతే... పట్టపగలైనా సరే... కోపంతో ఏమన్నా జేస్తడు" వారించబోయింది.

"కోపానికొస్తడని ఊకుంటే మన కొంప మునిగిపోతుంది. ఇప్పుడేపోతా, న్యాయం జెప్పుమని నలుగురి ముందు అడుగుతా" అంగలేస్తూ వెళ్లిపోయింది పార్వతి.

అంతే... మళ్లీ తిరిగిరాలేదు.

చీకట్లు కమ్ముకుంటున్నాయి. గుడిపూజారి వచ్చాడు.

"శారదా !" దమ్ము దీస్తున్నాడు.

"ఏందన్నా ?"

"మీ అమ్మ ఊరవతలి బాయిల శవమైతేలింది. బాయి చుట్టూ జనాలు మూగింద్రు" చెప్పి వెళ్లిపోయాడు.

నడినెత్తిమీద నాటుబాంబు పేలింది.

"అయ్యో అమ్మా !" బావురుమంది. "పట్టపగలు న్యాయం నవ్విందమ్మా !" గుండెలు బాదుకుంది. నెత్తినోరు కొట్టుకుంటూ వెక్కివెక్కి ఏడ్చింది శారద.

పసికూన మనోహర్ కాళ్లూ చేతులాడిస్తూ దీపం వైపే చూస్తూ ఆడుకుంటున్నాడు, నవ్వు కుంటున్నాడు.

"ఇది జనారణ్యం, ఇక్కడ మానవ మృగాలుంటాయి... అవి క్రూర మృగాలకంటే భయంకరమైనవని తెలుసుకోక, మానవమృగం గుహలో కెల్తే న్యాయం నవ్వకేం జేస్తుంది ?" అన్నట్టుందా నవ్వు.

మనోహర్ లేత చెంపల్ని నిమరాలని వంగింది తన చెక్కిళ్ల మీంచి జారిన కన్నీటిబొట్లు చెంపలమీద వాలి మెరుస్తున్నై.

"శారదా !" మళ్లీ వచ్చాడు పూజారి. "నువ్విక్కడుంటే బాగుండదు, నువ్వే మీ అమ్మ గొంతు పిసికి బాయిలేసినవని పుకారు పుట్టింది. జనాలు కోపంగున్నారు. జాగ్రత్తా !" చెప్పేసి చీకట్లో కలిసిపోయాడు.

గోరుచుట్ట మీద రోకటి పోటా !

ప్రపంచమంతా శతసహస్ర నయనాలతో చూస్తూ ఎగతాళిగా నవ్వుతున్నట్టనిపించింది. ఎవరో తన కొడుకుని లాక్కుని ముక్కలు ముక్కలుగా నరికినట్టు... ఇహ భరించలేక పోయింది. జోగినాథుని విగ్రహంకెదురుగా పసికూనను పడుకోబెట్టి చేతులు జోడించింది.

గుడి గంట మోగింది.

"శారదమ్మా!" వెనక నిలబడి పూజారి "ఇంకా నువ్వికడే ఉంటే ప్రమాదమే, ఏడ్వకు, కష్టాలు కట్టగట్టుకొచ్చినప్పుడే ధైర్యంగుండాలె. బాగా ఆలోచించాలె. ఈ ప్రపంచంలో నీకున్నది

ఈ పసిగుడ్డే. వీన్ని కాపాడుకో. ధైర్యంగా ముందుకు పోతే దేవుడు సాయం జేస్తడు. ఏడ్చుకుంటూ కూచుంటే భవిష్యత్తు ఏట్లో కలుస్తుంది". వంద రూపాయలు చేతులుంచి, "ఇంతకంటే మించిన సాయం ఈ అన్నయ్య చెయ్యలేడమ్మా !" గొల్లుమన్నాడు. తుండుగుడ్డను నోటికడ్డంగా పెట్టుకుని తప్పుకున్నాడు.

గుండె రాయిచేసుకోక తప్పలేదు.

ఒక్కడివే ఒక్కడివే ఒకడివే పదవోయ్... రేడియోలో విన్న రవీంద్ర కవీంద్రుని గేయం స్ఫూర్తినిచ్చింది. మనసు గట్టిపడింది. మొహం గంభీరమైంది. రాత్రి బస్సెక్కి తెల్లవారేలోగా పట్నం చేరుకుంది. పట్నంలో శ్రీ వేంకటేశ్వరాలయం ఆశ్రయమిచ్చింది. ఆ గుడి పూజారి దయామయుడు. తన గోడువిని పరిస్థితినర్థం చేసుకున్నాడు. భార్యతో చెప్పాడు. ఆ తల్లి కన్నతల్లిగా ఆదరించింది, రోజా... వాళ్ల కుటుంబాన్నాదుకుంటున్న బీడీ పరిశ్రమకు పరిచయం చేసింది. చెయ్యిపట్టి బీడీలు చెయ్యడం నేర్పించింది. అదే జీవితానికో ఆధారమైంది. మనోహర్ చదువులకో దారి చూపించింది.

✿ ✿ ✿

"దిగుండ్రి.... అందరూ దిగుండ్రి" కండక్టర్ అరుపులకు శారద కళ్లు తెరుచుకున్నై. బస్సు దిగింది. ఇల్లు వెతకడం పెద్ద కష్టమేగాలేదు. పడగ్గది, హాలు, పెరట్లో బావి, ఇంటిముందు కాంపౌండ్, దానిచుట్టూ పూలమొక్కలు, గేటుముందు ద్వారపాలకుల్లా రెండు కొబ్బరిచెట్లు... చూడముచ్చటగా ఉంది.

మర్నాడుదయం చాయ్ చప్పరిస్తూ "ఇల్లు బాగుంది. ఇల్లాలు ఉంటే ఇంకా బాగుండేదిరా !" మనసులోని ఆరాటాన్ని బయట పెట్టింది.

"నేనూ అదే ప్రయత్నంలో ఉన్నానమ్మా !" మనోహర్ దరహాసం.

మాతృ హృదయంలో మలయమారుతం వీచింది.

"నిజంగానా .... నిజంగానా బాబూ !" కళ్లు విశాలమైపోయినై.

"అవునమ్మా ! మనమీరోజే పెళ్లిచూపులకెళ్తున్నాం" నవ్వులో సిగ్గు మిళితమైంది.

"అంటే... !" వెన్నుపూసలో వెంటనే ఏదో అలజడి.

"సుగుణ అందాలరాశి. మా కాలేజిలోనే పనిజేస్తుంది. మా మట్టుకు మేము మనసులిచ్చి పుచ్చుకున్నాం." గోడగడియారాన్ని చూస్తుంటే మొహం మాణిక్యంలా వెలిగిపోతోంది. "అంతా బాగానే ఉంది. కాని .... అమ్మా !"

శారద గుండె ఝల్లుమంది.

ఆ సుగుణ తల్లిదండ్రులు కులగోత్రాలడిగారేమో !

ఆస్తిపాస్తుల గురించి, వంశం గురించి అడిగారేమో !

"ఆ.... కానీ ఏమిటా ?" ఊపిరి బిగపట్టుకుంది.

"వాళ్ల పెద్దవాళ్లూ, నువ్వూ ఆశీర్వదించాలె కదమ్మా "

నెత్తిమీంచి పది క్వింటాళ్ల బరువు దించుకున్నట్టు... మనసు కాస్త తేలికైంది.

"నా బాబు సుఖసంతోషాలే నాక్కావాలిరా !"

"నాకు తెలుసమ్మా ! మా అమ్మ అమృతమూర్తనీ, ఈరోజు నిన్ను తీసుకొస్తానని సుగుణతో, వాళ్ల పెద్దలతో చెప్పానమ్మా !" వచ్చి పక్కన కూర్చున్నాడు చిన్నపిల్లాడిలా "మనం వెళ్దామమ్మా" అన్నాడు.

"సరే..... మంచిది"

అలా అన్నదైతే అందిగాని అంతరంగంలో అల్లకల్లోలం తగ్గడం లేదు.

..... నిజం చెబితే అది నిప్పుకణమై కొడుకు బతుకులో మంటలు రేపుతుంది. వంద అబద్ధాలాడి ఓ పెళ్లి చెయ్యాలన్నారు గదా ! ఓం అందమైన అబద్ధం చెబితే !... హమ్మో !... అంతకంటే ఘోరం మరోటుండదు.

ఆటో మూడంతస్తుల బంగళా ముందాగింది. కొడుకు వెంట ముభావంగా నడుస్తోంది తల్లి.

చిరునవ్వులు చిందిస్తూ ఎదురొచ్చింది సుగుణ.

"సుగుణా ! ఈమె మా అమ్మ" పరిచయం చేశాడో లేదో పాదాలకు నమస్కరించింది.

పచ్చిపాలలో లేతపసుపు కలిపిన దేహఛాయ, నిండైన అవయవ సౌష్టవం, చక్కని చెక్కిళ్లు, నల్లని కనుబొమ్మల మధ్య ఎర్రని కుంకుమబొట్టు, చెవులకు మకరకుందనాలు... నిజంగా కుందనబ్బొమ్మనే ! అనుకుంది శారద.

సుగుణ లోపలికెళ్తోంది. ఆమె తల్లిదండ్రులు బయటికొచ్చి సాదరంగా ఆహ్వానించారు. స్వీటు, హాటు ముందుకొచ్చినై. అవేవీ తినాలన్పించలేదు.

"ముందు పెళ్ళిచూపులు. తర్వాతనే ..." నసిగింది శారద.

"ఎందుకమ్మా ?" ఓ ముసలాయన ముందుకొచ్చి నుంచున్నాడు. "అతికితే గతకదనా భయం !"

ఆ గొంతు ఎప్పుడో విన్నట్టుంది. గభాలున తలెత్తి చూసింది శారద. తటాలున లేచి నుంచుంది. ముసలాయన నోరెల్లబెట్టాడు.

"ను.... వ్వా.... !" అంటూ కూచున్నాడు.

"అ..... వు... ను... నేనే... ప్లీ... వీడు నా కొడుకు " ధైర్యంగా ఉండాలని ఎంత ప్రయత్నించినా కుదరడంలేదు.

"కూచోమ్మా !" సర్దుక్కూచున్నాడు ముసలాయన.

"ఇది నాకూతురు !" సుగుణ తల్లిని చూపించాడు. "దీని కూతురు సుగుణ... నా గారాల మనవరాలు..."

ఏ క్షణంలోనైనా పేలబోయే బాంబులా కనబడుతున్నాడు ముసలాయన.

సుగుణ తయారై వచ్చి ఎదురుగా సోఫాలో కూర్చుంది. తల్లిదండ్రులు చెరోప్రక్క చేరారు.

"జంట కన్నులపండువులాగుంది నాన్నా !" ముసలాయనతో అంది సుగుణ తల్లి.

"అవును !" ముసలాయన తెల్లని మీసాల క్రింద బోసినవ్వు. ఆ నవ్వుకు ఏమనుకోవాలో అర్థంగాలేదు శారదకు. సుగుణ, మనోమర్లు చూపులు కలిపి కళ్లతో మాట్లాడుకుంటున్నారు. మరోలోకంలో విహరిస్తున్నారు.

"మ్మీ... మీరు నాగరాజా... వీరయ్యసేటు తండ్రి గదూ !" అడిగింది శారద నిరుత్సాహంగా.

"అవునమ్మా ! తన స్వార్థంకోసం మనుషులు మూఢనమ్మకాలను, దురాచారాలను సృష్టిస్తారు. బలహీనులు బలైపోతారు. నీలాంటివాళ్లు ఎదిరిస్తారు. ఇప్పుడు నా ఆనందాని కవధుల్లేవు మాక్కావాల్సింది మా సుగుణ సుఖసంతోషాలు మాత్రమే ...!"

ఆ మాటలు అమృతధారల్లాగున్నాయి.

"ఇహ మీ అభిప్రాయం చెప్పండక్కయా !" సుగుణ తండ్రి అడిగాడు.

అనుమానాలన్నీ తుఫానుగాలికి ఎండుటాకుల్లా ఎగిరిపోయినై. శారద నవనాడుల్లో సంతోషం ఉరకలేసింది. గుండె ఆర్ద్రమై కళ్లు మసకబారాయి.

"నా కొడుకు అభిప్రాయమే నా అభిప్రాయము !" తృప్తిగా నిట్టూర్చింది.

**17 నవంబర్, 2001**
**'ఆంధ్రప్రభ' వారపత్రికలో**
**ప్రచురితమైంది.**

